# న్యాయం సాధించటానికి

## ఎం. డి. సౌజన్య



నేను సేకరించిన వివరాలు వినగానే "అయితే ఒక చిన్న నాటకం ఆడాలి!" అన్నాడు సుబ్బారావు.

"ఇక ఆపరేషన్ తప్పదు" అని ఎక్స్‌పర్ట్ సర్జన్ అన్నట్లనిపించింది నాకు.

సుబ్బారావు నా చిన్ననాటి నా ఆత్మీయ మిత్రుడు. చిన్నప్పటి నుంచి నాటకాలు ఆడి ఆడి, చివరికి ఆ పిచ్చిలో పడి, చదువు ఇంటర్‌మీడియట్‌తోనే మానుకున్నాడు.

ఉద్యోగంలో చేరిన తరువాత నాటకాలు మానివేశాడనుకున్నాను.

"వాగే నోరూ - ఆడే కాలు ఊరుకోవు" అన్న సామెత గుర్తొచ్చి నవ్వొచ్చింది.

"ఏరా! ఇంకా నీ నాటకాల బుద్ధి పోలేదా?" అన్నాను.

"నాటకాలను అంత తేలిగ్గా తీసివేయకు! నిజం చెప్పాలంటే మనం రోజూ ఎన్ని నాటకాలు ఆడడం లేదు. నువ్వు ఈ పనిమీద హైద్రాబాద్‌కు వస్తూ ఏమని సెలవు పెట్టావు? నేను నీతో బయలుదేరటానికి మా ఆవిడకి ఏమని చెప్పాను...? అవన్నీ కూడా చిన్న రకం నాటకాలు కాదా?" అన్నాడు.

వాడు చెప్పింది నిజమే - నిజాన్ని ఎందుకో ఎవడూ చెప్పడు.

ఒక వేళ చెప్పినా, అది హర్షించరు !?

"సరే ఏం చేద్దామంటావు?" అన్నాను చివరికి.

"చెప్తాగా ... ఎవరికీ ఇబ్బంది లేని చిన్న నాటకం ఆడుదాం! కథ నేనునడిపిస్తాను... నువ్వు మాత్రం నేను చెప్పింది నిజమేనని తలాడిస్తూండు!" అన్నాడు. వాడు చెప్పింది వినక తప్పని పరిస్థితే అనిపించింది. అయినా... లోలోపల అంతరాత్మ ఘోషపెడుతోంది.

"అయితే ఇన్ని అబద్ధాలు... ఘోరంగా?" అన్నాను అసహాయంగా.

"రుజుమార్గంలో పని కానప్పుడు ఇక మిగిలిన మార్గం అదే!" అన్నాడు సుబ్బారావు.

నేను మెత్తపడ్డట్టు గ్రహించినట్టున్నాడు.

"పోదాం... బయలుదేరు!" అన్నాడు తనే దారి చూపుతూ.

ఆవువెంట దూడలా, నేనూ అనుసరించక తప్ప లేదు. సుబ్బారావు చిన్నసైజు నాటకం ఆడతాడు...

ఏం నాటకమో చెప్పలేదు.

నాటకం రక్తికడితే ఫర్వాలేదు...! ఒక వేళ ఎదురు తిరిగితే...!? మళ్ళీ ఒక్కపక్క సందేహం.

నిండా మునిగినవాడికి చలేమిటి!

అసలెలాగూ కాదనుకున్న పనేగా ?

అది కాకపోతే బాధ దేనికి?

రకరకాల ఆలోచనలు నా మనసులో మెసలుతున్నాయి. సిటీ బస్సు ఆగగానే "ఇక్కడే దిగాల్సింది " అన్నాడు.

"ఇక్కడే మనం నాటకం ఆడాల్సింది" అన్నట్టు వినిపించింది. సుబ్బారావు గేటు దగ్గరికి నడిచాడు.

గేటువాచ్‌మన్ - లంకకు లంఖిణిలా కాపలా కాస్తున్నట్టు కనిపించాడు.

"గోరీవి నువ్వేనా?" అన్నాడు సుబ్బారావు దర్పమంతా మాటల్లో ధ్వనించేట్టు.

పోలీసు అధికారి "ఈ పేట రౌడీవి నువ్వేనా?" అన్నట్టు.

"నాది పేర్ ఘోరీ సాబ్!" అన్నాడు వాచ్‌మన్ హైద్రాబాద్ యాసతో.

"తెలుసు! క్యాంప్ ఆఫీసర్ పీతాంబరంగారు ఫోన్ చేసి రమ్మన్నారు. మళ్ళీ ఈవినింగ్ క్యాంపు ప్రారంభమైతే కుదరదన్నారు. కావాలంటే ఆయన్నే అడిగిరా...! ఆయన అల్లుడు ఆనందరావు వచ్చాడని చెప్పు!" అన్నాడు సుబ్బారావు, కాస్త కోపం, వినుకు మిళాయించి.

అంత పెద్ద మనుషులుగా కనిపించేవాళ్ళు అన్ని అబద్ధాలు చెప్పరనుకున్నాడేమో.

పాపం! అడ్డు తొలిగి "అందర్ జాయియే సాబ్!" అన్నాడు ఘోరి.

ఏకంగా పీతాంబరం గారితో అంత దగ్గరి సంబంధం వున్నట్టు చెప్పడం మరీ ఘోరమనుకున్నాను.

మెల్లిగా ముందుకు నడుస్తున్నాము.

పీతాంబరం గారి దగ్గరికైతే చేరగలిగాం! మరి పీతాంబరం చేత పని చేయించేదెట్లా? ఆలోచిస్తున్నాను మా సుబ్బారావు వెంట వెళుతూ.

పరీక్షలక్యాంపు ఆఫీసరు పీతాంబరంచండశాసనుడని - ఎగుడు దిగుడు పనులు తను చేయకపోవడమేకాక, ఇతరులు చేసినా సహించడని, అందుకే - ఇంటర్ బోర్డు ఈయనను ప్రతిసారీ క్యాంపు ఆఫీసరుగానేపిలుస్తుందని, తెలుసుకున్నాను.

ఈ కొరకరాని కొయ్యచేత మా సుబ్బారావు ఎలా పని సాధించుకొస్తాడో అర్థంకావడం లేదు!!

"అప్పారావ్ ! ఈ పీతాంబరమేగా... ఫోటో పేపర్లో పడ్డ ఆ యూనివర్సిటీ ఫస్ట్ వచ్చిన జయలక్ష్మి తండ్రి... ప్రిన్సిపాల్ పీతాంబరం...!!"

సుబ్బారావ్ నన్ను మళ్ళీ అడిగాడు.

"ఔనా ! ఆ జయలక్ష్మే మా చెల్లెలు పద్మ క్లాస్‌మేట్...!! ఇద్దరూ ఇంటరులో డిగ్రీలో క్లాసుమేట్స్! ఏం... అలా అడుగుతున్నావు?" అన్నాను అనుమానంగా.

"ఈ పీతాంబరంగాడి పీక పట్టుకోడానికి... వీక్ పాయింట్ ఎక్కడవుందో వెతుకుతున్నాను! జయలక్ష్మికి పెళ్లయిందా?" అడిగాడు.




"ఈ జన్మలో కాదు!"

"ఏం?"

"ఆ అమ్మాయి చదువుల సరస్వతేకాని... రూపం మాత్రం చాలా వికారంగా వుంటుంది!" చెప్పాను.

"ఫలో యార్!" అన్నాడు సంతోషంగా సుబ్బారావు.

అది నాకు 'యురేకా' లా వినిపించింది.

నేను ఇంకా వెనుకంజ వేస్తున్నాను!!

"భయపడకు అప్పారావ్! నువ్వు నేను చెప్పిన ప్రతిదానికి తలాడిస్తూ... అవును... అవును... అన్నట్టు ... చిరునవ్వులు చిందిస్తూ వుండు... కథ నేను నడిపిస్తాను!" అన్నాడు.

ఇంతలో ఒక పెద్ద హాలు ప్రక్కనే వున్న చిన్న గది దగ్గరకొచ్చాం.

"ఇదే... ఆ రాక్షసుడి గుహ" అన్నట్టు తల ఆడించాడు సుబ్బారావు తనే ముందులోపలికి ప్రవేశిస్తూ. నేను నీడలా అనుసరించాను.

"నమస్కారం సార్!! క్షమించాలి... అనుమతి లేకుండా వచ్చినట్టున్నాము!" అన్నాడు సుబ్బారావు తలవంచి, ముకుళిత హస్తాలతో.

క్యాలిక్యులేటర్‌తో ఏవో అంకెలు కూడుకుంటూ, మరో లోకంలో వున్నట్టున్న పీతాంబరం, బట్ట తల పైకెత్తి భూతద్దాల కళ్ళజోడులోనుంచి, భూతంలా చూశాడు.

"ఎవరు మీరు...!!" నా గుహలోకి అనుమతి లేకుండా రావటానికి ఎన్నిగుండెలా మీకు: – అన్నట్టుంది ఆయన వాలకం.

"తమరు... పి.వి.ఆర్. జూనియర్ కాలేజీ... ప్రిన్సిపాల్ పీతాంబరంగారు...!!" అన్నాడు సుబ్బారావు.

"ఔను ... మీరు...!?" అన్నాడు - అప్పటికే ఆయన కళ్ళల్లో కోపం, ముఖంలో తీవ్రత, మాటల్లో విసుగు కనిపించాయి.

"మొన్న విజయవాడ సత్యనారాయణపురం వెళితే... మీరిక్కడ వున్నట్టు చెప్పారు! మా తమ్ముడు ఆనందరావ్... అమెరికా నుంచి వచ్చాడు...!! వాడు గ్రీన్ కార్డ్ హోల్డర్ లెండి! బ్రహ్మచారి...!! ఆ మధ్య మీ అమ్మాయి... బి.ఏ.లో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చిందని పేపర్లో వేశారటకదా!! అక్కడ చూశాట్ట! అలాంటి తెలివి గల అమ్మాయినే చేసుకోవాలని తెగ ఉబలాటపడిపోతున్నాడు!" చెప్పాడు సుబ్బారావు. పీతాంబరంగారి మాటల్లో అంత వరకున్న తీక్షణత క్షణంలో మారి పోయింది.

"నా సెలక్షనే వాడి సెలక్షన్...! పెళ్ళి భారమంతా నా మీద వేశాడు! అక్కడ బఫెలో ప్రాంతంలోని ఒక కంపెనీలో చీఫ్ ఎగ్జిక్యూటివ్... మంచి తెలివిగల అమ్మాయి భార్య అయితే అక్కడ ఆ అమ్మాయికీ మంచి జాబ్ ఇప్పించుకోగలడట! అందుకేయూనివర్సిటీ ఫస్టొచ్చిన అమ్మాయి కావాలని... వివరాలు తెలుసుకోమని వ్రాశాడు! వివరాలన్నీ మాకు వచ్చాయి!" చెప్పాడు సుబ్బారావు.

మా నాటకాల సుబ్బారావు వివరణ పన్నీటి జల్లులా తోచిందేమో... పీతాంబరం... అంతవరకు చిటపట లాడినవాడు... మంచుముక్కలా వల్లబడిపోయాడు!!

అంత వరకున్న విసుగు, కోపం స్థానే ప్రసన్నత, కోపం, తాపం స్థానే ఆప్యాయత, ఆత్మీయత కనిపించాయి.

ఏ బ్రహ్మాండమో బ్రద్దలవుతుందోనని భయపడ్డ నాకు ఆశ్చర్యం వేసింది.

మా సుబ్బారావు... పీతాంబరం బలహీనత మీద వేసిన దివ్యాస్త్రం అమోఘంగా పని చేసింది.

"ఇంకా నిలబడే వున్నారు... కూర్చోండి! ఈ కేంప్ ఆఫీసర్ అయినప్పటి నుంచి ఎవరొచ్చినా ఏ మార్కుల గోలోనని అనుమానం!! రండి... ప్లీజ్ టేక్ యువర్ సీట్స్!" అన్నాడు పీతాంబరం, అప్పుడే పెళ్ళి మర్యాదలు మొదలుపెట్టి.

'హమ్మయ్య! మొత్తానికి కోటలో పాగా వేశాం!' అనిపించింది నాకు.

ఇంతలో పీతాంబరం మజా మూడు డ్రింక్ ఆర్డరిచ్చాడు.

"మా తమ్ముడు - పెద్ద రివల్యూషనిస్టు ...కట్నాలు కానుకలు అంటూ నోటితో అన్నా ఊరుకోడు! కాబట్టి ఆ విషయాలు మాత్రం దయచేసి ఎత్తవద్దు. ఇంటి పేరునిబట్టి - మంచి సంప్రదాయమైన కుటుంబమని తెలుస్తూనే వుంది. ఇక మీ నీతి నిజాయితీ గురించి... జనం కథలు కథలుగా చెప్పకుంటారు!" అన్నాడు సుబ్బారావు నిజాయితీ మాటల్లో ధ్వనించేట్టు.



వద్దు నీకు డౌటు, ఓచిన్నారి ఓటు
సత్యప్రభ - హైదరాబాద్

ఇక పీతాంబరానికి సహస్ర నామస్తోత్రం విన్నట్టుందేమో... ముఖంలో వింత కాంతి మెరిసింది.

సుబ్బారావు ప్రతిమాటా రాంబాణంలాపనిచేస్తోంది.

" జయలక్ష్మి మీ పెద్దమ్మాయనుకుంటా?" అన్నాడు సుబ్బారావు అసలు విషయంలోకి వస్తున్నట్టు.

"ఔనండి...!! నాకు ఆరుగురు ఆడపిల్లలు ... పెద్దమ్మాయి జయలక్ష్మి, బి.ఏ. యూనివర్సిటీఫస్టొచ్చి - ప్రైవేటుగా ఎం.ఎ. చదువుతోంది. నలుగురు మగ పిల్లలు. ఇద్దరు కాలేజీలో - ఇద్దరు హైస్కూల్లో చదువుతున్నారు" అన్నాడు పీతాంబరం.

"అయితే మీరు ఇంట్లో వున్నా, స్కూల్లో వున్నా ఆట్టే తేడా వుండదు...! ఎంత అదృష్టవంతులు!" అంటాడనుకున్నాను.

చిరునవ్వుతో సరిపెట్టాడు సుబ్బారావు.

"మా వంశంలో అయిదో ప్రిన్సిపాల్‌నండి నేను! ఏమిటో ఈ అనవాయితీ...మా ముత్తాత సుబ్రహ్మణ్య దీక్షితులు, మా తాత వెంకటేశ్వర దీక్షితులు, మా నాన్న రామయ్య దీక్షితులు... అందరూ హెడ్ మాష్టర్లో... ప్రిన్సిపాల్సో," చెప్పకు పోతున్నాడు పీతాంబరం తన వంశ చరిత్ర.

"మీరు ఈ క్యాంపు కార్యక్రమం ముగించి ఎప్పుడు విజయవాడ చేరుకుంటారో చెబితే మా తమ్ముడు, నేను మీ ఇంటికొచ్చి తాంబూలాలు పుచ్చుకుందామని" చెప్పాడు సుబ్బారావు.

ఇంతలో కూల్ డ్రింక్స్ రావడంతో సుబ్బారావు ఆ పని ముగించాడు.

"నా పని రేపు పన్నెండుతో అయిపోతుంది. ఎల్లుండి రిజల్ట్సు కమిటీ మీటింగ్! పధ్నాలుగువ నేను ఇంట్లోనే వుంటాను... ఆ రోజు ఆదివారం కూడా!" అన్నాడు.

"అయితే పెళ్ళికొడుకుతో పధ్నాలుగు ఆదివారం ఎనిమిదింటికి ఎక్స్‌ప్రెస్‌లో దిగుతాం! మా వాడు ముక్కు సూటిగా పోయే మనిషి... మీరు గాని, మీ తరపున మనుషులుగాని ... దయచేసి కట్నకానుకల విషయం ఎత్తరుగా!" అన్నాడు సుబ్బారావు సీరియస్‌గా.

"మీరంత ఇదిగా చెప్పాక ఇంక ఆ విషయాలు ఎత్తుతామా?" అన్నాడు పీతాంబరం.

"అయితే, ఇక సెలవు తీసుకుంటాము సార్!" అన్నాడు సుబ్బారావు.

'ఓరి వీడి దుంప తెగా! అసలు నేను వచ్చిన పని... ఇంత కష్టపడి నాటకం ఆడింది.... ఈ మజా కూల్ డ్రింక్ మజా మజాగా తాగిపోవటానికా?' అనుకున్నాను కడుపు మండిపోతుండగా.

అప్పటికే సుబ్బారావు నాలుగడుగులు వేసినట్టున్నాడు. నేను గమనించలేదు. నేను అలాగే వుండిపోయాను.

ముందుకు వెళ్ళిన సుబ్బారావు... సిగ్నల్ ఇవ్వకపోతే రైలు వెనక్కు వచ్చినట్టు వచ్చి "ఆ మాటల్లో మరిచాను... పెళ్ళికొడుకు చెల్లెలు... అదే ... మా చిన్న చెల్లెలండి! అచలాదేవి...!" అన్నాడు నసుగుతూ.

ఏదో చెప్పలేని విషయం బలవంతంగా చెప్పాల్సి వచ్చినప్పటి బెరుకు, బాధ కొత్తవాళ్ళముందు చెప్పాల్సి వచ్చినప్పటి అసహాయత ధ్వనింపజేశాడు సుబ్బారావ్.

"చెప్పండి... అమ్మాయి నెంబరెంత...? ఆడపిల్లల విషయంలో కొన్ని మినహాయింపులు తప్పవు!" అన్నాడు సీతాపతి.

ఇక ఆ నెంబరు వాడి తరపున నేనే చెప్పాను. ఎంతో బాధపడిపోతున్నట్టు అక్కడి నుంచి వెళ్ళాడు సుబ్బారావు. నా పని ఏదో విధంగా అయినందుకు ఆనందించాను. మొత్తానికి మా సుబ్బారావు నాటకాల పిచ్చి అలా పని చేసింది.

